క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం

మొయినాబాద్: మండల పరిధిలోని కనకమామిడి సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని మొయినాబాద్ విద్యుత్ ఏఈ హమునాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. కనకమామిడి 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు కనకమామిడి, అప్పారెడ్డిగూడ, సజ్జన్‌పల్లి, తోలుకట్ట, చిన్నషాపూర్, ఎలుకగూడ, పెద్దమంగళారం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఆయా గ్రామాల రైతులు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కనుల పండువగా కల్యాణోత్సవం



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

కేశంపేట: మండల పరిధిలోని లింగంఘన గ్రామంలో శుక్రవారం రేణుక ఎల్లమ్మ కల్యాణోత్సవాన్ని భక్తులు, గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డిలు వేర్వేరుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దయ అందరిపైన ఉండాలని, ప్రజలను సుఖసంతోషాలతో ఉంచాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జగదీశ్వర్‌గౌడ్, నాయకులు లక్ష్మీనారాయణగౌడ్, మధుసూధన్‌గౌడ్, శ్రీనివాస్, సుధాకర్, కుమార్ గుప్తా, నరేందర్‌రెడ్డి, తిరుపతి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి



చేవెళ్ల ఏసీపీ కిషన్‌ను సన్మానిస్తున్న మల్లేష్‌గౌడ్

మొయినాబాద్: గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు సహకరించాలని చేవెళ్ల ఏసీపీ కిషన్ అన్నారు. గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రేనట్ల మల్లేష్‌గౌడ్ చేవెళ్ల ఏసీపీ కిషన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు తగ్గించవచ్చన్నారు. ప్రజలు తమ ఇళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం మంచిదన్నారు. అదే విధంగా గ్రామాల్లోని వీధులు, రోడ్లపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు సహకరించాలన్నారు.

అధికారులపై దాడి అప్రజాస్వామికం



మాట్లాడుతున్న సుమన్

కొందుర్గు: వికారాబాద్ జిల్లా లగచర్లలో అధికారులపై చేసిన దాడి అప్రజాస్వామికమని ఎన్ఎస్‌యూఐ జిల్లా నాయకుడు సుమన్ విమర్శించారు. శుక్రవారం చౌదరిగూడలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు కుట్రపూరిత రాజకీయం చేస్తున్నారన్నారు. ఈ దాడి వెనుక మాజీ ఎమ్మెల్యేతోపాటు కేటీఆర్ ఉన్నారన్నారు. ఇలాంటి చర్యలు మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో నాయకులు కార్తీక్ రెడ్డి, నిసార్, డానియల్, భరత్, సుమైర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



ఎల్లమ్మ దేవతకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

కొందుర్గు: మండల కేంద్రంలోని ఎల్లమ్మ దేవతా ఆలయ నిర్మాణం కోసం శుక్రవారం భూమిపూజ చేశారు. పూజారి రాజేశ్వరస్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తుల ఆర్థిక సహకారంతో దేవాలయ నిర్మాణం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా పూజారి మాట్లాడుతూ.. అమ్మవారి ఆలయ నిర్మాణం కోసం దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో యాదయ్య, రామయ్యగౌడ్, జగదీశ్వర్ గౌడ్, లక్ష్మయ్యగౌడ్, అనిల్‌గౌడ్, ప్రవీణ్, నరేందర్, దర్శన్ పాల్గొన్నారు.



మొయినాబాద్: శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



చేవెళ్ల: శివాలయంలో తెల్లవారుజామున దీపాలను వెలిగిస్తున్న భక్తులు



మొయినాబాద్‌రూరల్: శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ఆధ్యాత్మిక శోభ.. భక్తజన ప్రభ

దేవాలయాల్లో కార్తీక పౌర్ణమి సందడి • దీపాలు వెలిగించేందుకు పోటెత్తిన భక్తులు



చేవెళ్ల: కొనగట్టు శివాలయంలో అభిషేకం చేస్తున్న భక్తులు



చేవెళ్ల: హనుమాన్ ఆలయంలో ..



మొయినాబాద్‌రూరల్: కనకమామిడి ఆలయంలో..

చేవెళ్ల: కార్తీక పౌర్ణమి వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయాలకు పోటెత్తారు. ఉదయం నుంచి రాత్రి వరకు శివాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తెల్లవారుజాము నుంచి పూజలు

మొయినాబాద్‌రూరల్: కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా మండల పరిధిలోని ఆయా దేవాలయాల్లో దీపోత్సవాల వెలుగులు నిండాయి. శుక్రవారం పర్వదినాన్ని పురస్కరించుకొని హిమాయత్ నగర్ స్వామినారాయణ గురుకుల్ లోటస్ టెంపుల్ శివాలయం, గ్రామంలోని సోమేశ్వర ఆలయంలో, అమ్డాపూర్ శివాలయంలో, కనకమామిడి సంగమేశ్వర ఆలయం, దత్తాత్రేయ ఆలయంలో దీపాలను మహిళలు పెద్ద ఎత్తున తరలివెళ్లి వెలిగించారు. ఆయురారోగ్యాలు కొనసాగిస్తారని నమ్మకంతో దేవాలయాలకు భక్తులు పోటెత్తారు.

కార్తీక దీపారాధన

మొయినాబాద్: కార్తీక పౌర్ణమి సందర్భంగా శివాలయాల్లో భక్తుల సందడి నెలకొంది. శుక్రవారం మొయినాబాద్ మండల కేంద్రంలోని శివాలయంతోపాటు పలు గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి దీపారాధన చేశారు. మొయినాబాద్ శివాలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో వేడుకలు

కొందుర్గు: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనరసింహా స్వామి దేవాలయంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారి రాజేశ్వరస్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.



చేవెళ్ల: కొనగట్టు శివాలయంలో ప్రత్యేక అలంకరణ



మొయినాబాద్: సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు



కొందుర్గు: శ్రీ లక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో..

కాంగ్రెస్ పాలనలో పేదలకు అన్యాయం

రాష్ట్ర సహకార సంఘం మాజీ చైర్మన్ రాజావరప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న రాజావరప్రసాద్

షాద్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఉసురు పోసుకుంటుందని రాష్ట్ర సహకార సంఘం మాజీ చైర్మన్ రాజావరప్రసాద్ ఆరోపించారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మార్పు పేరుతో రాష్ట్రం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం అయ్యిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో ఏ ఒక్క శాఖ కూడా సక్రమంగా పని చేయడం లేదని దుయ్యబట్టారు. ఆరుగాలం కష్టపడి రైతులు పంటలు పండిస్తే కాంగ్రెస్ పాలనలో వారు దోపిడీకి గురవుతున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టుల నిర్మాణానికి, పరిశ్రమల ఏర్పాటుకు భూములు సేకరిస్తుంటే డీటేల్ ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్) లేకుండా ఎలా భూములు సేకరిస్తారని ప్రశ్నించిన రేవంత్‌రెడ్డి ఇప్పుడేం చేస్తున్నాడని విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పాలనలో కడుపు రగిలి ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటే ప్రతిపక్ష పార్టీల నేతలే డబ్బులు ఇచ్చి ప్రజలను ప్రభుత్వం పైకి ఉసిగొల్పుతున్నారని అనడం సరికాదని అన్నారు. ఈ సమావేశంలో చందు నాయక్ పాల్గొన్నారు.

బీరప్ప జాతరకు హాజరుకండి

కురుమ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి యాదయ్య



ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డికి ఆహ్వాన పత్రం అందజేస్తున్న కురుమ సంఘం నాయకులు

షాబాద్: హైతాబాద్‌లో నిర్వహించే బీరప్ప జాతరకు హాజరు కావాలని నేతలను కురుమ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సూద యాదయ్య ఆహ్వానించారు. శుక్రవారం నగరంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఇన్‌చార్జి పామెన భీంభరత్‌లను కలిశారు. ఈనెల 18వ తేదీన మండలంలోని హైతాబాద్ గ్రామంలో బీరప్ప జాతరకు హాజరు కావాలని ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకుంటే మానసిక ప్రశాంతత కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శేఖర్, కురుమ సంఘం నాయకులు ఆంజనేయులు, చర్లకుమార్, నర్సింహులు, శంకర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



రేగడిదోస్వాడలో శిథిలమైన పశు వైద్యశాల భవనం



భవనంలో నీరు పట్టి ఉన్న గోడలు

శిథిల భవనం.. వెళ్లాలంటే భయం

ఎప్పుడు కూలుతుందో తెలియని పశు వైద్యశాల

• ఆందోళన చెందుతున్న రైతులు, ఉద్యోగులు

షాబాద్: శిథిలావస్థకు చేరిన పశు వైద్యశాల భవనంతో స్థానికులు బిక్కుబిక్కుమంటున్నారు. మండల పరిధిలోని రేగడిదోస్వాడ పశు వైద్యశాల భవనం పూర్తిగా కూలేందుకు సిద్ధంగా ఉంది. భవనం స్లాబ్ కింది భాగం నుంచి తరచూ సిమెంట్ పెచ్చులు ఊడిపడుతున్నాయి. దీంతో ఇందులో పనిచేసే ఉద్యోగులు, వైద్యశాలకు వస్తున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. రేగడిదోస్వాడలో 30 ఏళ్ల క్రితం పశు వైద్యశాల భవనాన్ని నిర్మించారు. కాగా పూర్తిగా శిథిలమైన ఈ భవనాన్ని వినియోగించొద్దని ఇంజనీరింగ్ శాఖ అధికారులు గతంలోనే సూచించారు. ప్రత్యామ్నాయ మార్గాలు లేకపోవడంతో ఇందులోనే కొనసాగిస్తున్నారు. కొత్త భవనం నిర్మాణం విషయమై ఆశాఖ ఉన్నతాధికారులు నాలుగైదేళ్లుగా ప్రయత్నిస్తుండగా నిధులు మంజూరు కావడంలేదు. దీంతో విధిలేని పరిస్థితుల్లో ఉద్యోగులు ఈ భవనంలోనే భయం భయంగా విధులు నిర్వర్తిస్తున్నారు. కార్యాలయంలోనే తాము విధి నిర్వహణలో ఉన్న సమయంలోనే పలుమార్లు స్లాబ్ పైభాగం నుంచి సిమెంట్ పెచ్చులూడి పడ్డాయని ఉద్యోగులు భయాందోళన వ్యక్తం చేశారు. శిథిలమైన ఈ భవనం స్థానంలోనే కొత్త భవనం నిర్మాణం కోసం గతంలో ఎంపీపీ సర్వ సభ్య సమావేశంలో తీర్మానం చేసినా ఫలితం లేదు.

ప్రతిపాదనలు పంపించాం



పశువైద్యశాల భవనం పూర్తిగా శిథిలమైంది. దీంతో దాని స్థానంలో కొత్త భవనం నిర్మాణానికి ఇప్పటికే ఉన్నతాధికారులు ప్రతిపాదనలు పంపించాం. ఈ భవనం పూర్తిగా శిథిలమవ్వడంతో లోపల కూర్చోవాలంటేనే భయాందోళన చెందుతున్నాం. రైతులు కూడా లోపలికి రావాలంటేనే భయపడుతున్నారు.

– డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, రేగడిదోస్వాద, షాబాద్

బిక్కుబిక్కుమంటూ..

పూర్తిగా శిథిలమై.. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితిలో పశువులకు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వస్తున్న రైతులు లోపలికి వెళ్లాలంటేనే భయపడుతున్నారు. తాము లోపలికి వస్తే ఎక్కడ తమపై సిమెంట్ పెచ్చులూడి పడుతాయోనని ఆందోళన చెందుతున్నారు. కాగా ఈ ఆస్పత్రికి పరిధిలో తాళ్లపల్లి, పోతుగల్, చందనవెళ్లి, హైతాబాద్ సబ్ సెంటర్లు ఉన్నాయి. ప్రతీ రోజు పశువులకు చికిత్స నిమిత్తం ఐదు వందల మంది వరకు రైతులు తమ పశువులను వైద్యశాలకు తెస్తున్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి



షాద్‌నగర్: కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్



కేశంపేట: కొత్తపేటలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ గ్రామ శివారులో ఉన్న ఎఫ్‌సీఎస్ అనాథాశ్రమంలో 130 మంది నిరుపేద మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. పేద మహిళలు అభ్యున్నతి కోసం ఎఫ్‌సీఎస్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు చేపట్టడం హర్షణీయమన్నారు. మహిళలు స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకొని ఆర్థికంగా బలపడాలన్నారు. ఫౌండేషన్ అందజేసిన కుట్టుమిషన్‌లను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం కూడా మహిళల అభ్యున్నతి ఎంతో కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు యాదయ్యయాదవ్, విశ్వం, చెన్నయ్య, శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, సుదర్శన్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్, శ్రవణ్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహీం, ముబారక్, ప్రభాకర్, శేఖర్, అశోక్ ఫౌండేషన్ నిర్వాహకులు థామస్, గీత తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాలను వినియోగించుకోవాలి

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగించుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రైతులకు సూచించారు. మండల పరిధిలోని కొత్తపేట, కేశంపేట, తొమ్మిదిరేకుల గ్రామాల్లో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రాథమిక వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. వీటిని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మద్దతు ధర లభిస్తుందన్నారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జగదీశ్వర్, నాయకులు విశాల శ్రావణ్‌రెడ్డి, వీరేష్, జగదీశ్వర్, యాదయ్యయాదవ్, శ్రీధర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, అంజిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రమేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

చేవెళ్ల: మండలంలోని మీర్జాగూడ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయానికి మండలంలోని పలు పార్టీలకు చెందిన దాతలు విరాళాలు అందజేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్‌రెడ్డి రూ.51వేలు, చూగురి ప్రవీణ్‌రెడ్డి రూ.21వేలు, కుంచం శ్రీనివాస్ రూ.11వేలు, జి.మధుసుధన్‌రెడ్డి రూ.11వేలు, మచ్చేందర్‌రెడ్డి రూ.5వేల విరాళాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దాతలను ప్రత్యేకంగా అభినందించారు. మండలంలోని అన్ని పార్టీల నాయకులు, ప్రజలు ఆలయ నిర్మాణానికి సహకారం అందించాలని కోరారు.

ఆవిష్కరణలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ది హ్యాకింగ్ స్కూల్ ఫౌండర్ మిరాజ్ ఫహీం

మొయినాబాద్: సాంకేతిక రంగ విద్యార్థులు సామాజిక పరమైన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని ది హ్యాకింగ్ స్కూల్ ఫౌండర్ మిరాజ్ ఫహీం అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో 'సహయోగ్ 2.0' పేరుతో రెండు రోజులపాటు నిర్వహించే ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సమిట్ శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకుంటూ సామాజిక ఆవిష్కరణలను రూపుదిద్దాలన్నారు. పల్లెసృజన ప్రెసిడెంట్ బ్రిగేడియర్ గణేశం మాట్లాడుతూ.. విద్యాసంస్థలు గ్రామీణ ప్రాంతాల ప్రజలతో కలిసి వారి సమస్యలు అర్థం చేసుకుని.. వాటి పరిష్కారానికి ప్రేరణ కల్పించే విధంగా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. హైదరాబాద్ ఐఐటీ ప్రొఫెసర్ సి.కృష్ణమోహన్ మాట్లాడుతూ.. విద్యార్థులకు వినూత్నమైన పాఠ్యాంశాలు బోధించడం ద్వారా సమాజానికి ఉపయోగకరమైన వ్యక్తులుగా తీర్చిదిద్దవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రోహిత్ కందకట్ల, ప్రిన్సిపల్ సాయి సత్యనారాయణరెడ్డి, కాసే సంస్థ సీఈఓ సత్య ఎల్లా, ఇన్నోవేషన్ హెడ్ సురేష్ సోమల, సీఐఎస్‌టీ హెడ్ సంయుక్త పెంట, ఐఐసీ కోఆర్డినేటర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.